అటకెక్కిన భూసార పరీక్షలు

- నిరుపయోగంగా కిట్లు
- పంటల సాగుపై అవగాహన కరువు
- ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్న రైతులు

చింతలమానేపల్లి, జూన్ 13: గ్రామాల్లో భూసార పరీక్షలు అటకెక్కాయి. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని అనువైన పంటలతో అధిక దిగుబడులు సాధించేందుకు అయిదేళ్ల క్రితం క్లస్టర్ గ్రామాల్లో ఏర్పాటుచేసిన మినీ భూసార కిట్లు నిరుపయోగంగా మారాయి. ల్యాబ్‌ల్లో కాకుండా గ్రామస్థాయిలో పరీక్షలు నిర్వహించేలా వ్యవసాయశాఖ వెసులుబాటును కల్పిస్తూ 2018లో వీటిని అందుబాటులోకి తెచ్చింది. మినీ యంత్రాలతో గ్రామస్థాయిలో మట్టి పరీక్షలు నిర్వహించే అవకాశం కల్పించింది. అందుకు మినీ భూసార పరీక్షలు ఏర్పాటు చేశారు.

భూసార కేంద్రాల్లో పరికరాలను అందుబాటులో ఉంచినా పరీక్షలు చేసేందుకు కావాల్సిన రసాయనిక కిట్లను ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో కిట్లు మూలనపడ్డాయి. దీంతో రైతులు ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించి డబ్బులు ఖర్చు చేసుకుంటున్నారు. వానా కాలం పంటకు సాగుకు సిద్ధమవుతున్న తరుణంలో అసలు భూసార పరీక్షలు నిర్వహిస్తారా లేదా అనే అనుమా నాలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి.


మట్టి నమూనాలు సేకరిస్తున్న ఏఈఈవోలు (ఫైల్)

వ్యవసాయ క్లస్టర్లకు కిట్లు..

జాతీయ సుస్థిర వ్యవసాయాభివృద్ధి పథకంలో భాగంగా మండలంలోని రైతులకు అందుబాటులో సేవలందించేందుకు క్లస్టర్‌లుగా విభజించి ఏఈవోలను నియమించారు. అన్ని క్లస్టర్లకు పరికరాలను అందజేశారు. రైతులకు అందుబాటులో మట్టి పరీక్షలు నిర్వహించేందుకు నమునాలు సేకరించారు. రెండేళ్ల పాటు సేవలందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరికరాలతో పాటు రసాయనిక కిట్లను అందజేశారు. ఇందులో కేంద్రం 40శాతం, రాష్ట్రం 60శాతం వ్యయాన్ని కేటా యించేవారు. ప్రారంభించిన రెండేళ్లకే మట్టి పరీక్షలకు కావాల్సిన కిట్లను అందించకపోవడంతో పరికరాలు రైతు వేదికల్లో మూలనపడ్డాయి. మట్టి నమునాలు సేకరించి భూసార పరీక్ష కార్డులను అందజేయాలన్న లక్ష్యాన్ని మరిచిపోయారు.


భూసార పరీక్షలు నిర్వహిస్తున్న ఏఈఓలు (ఫైల్)

అధిక మోతాదులో రసాయనాల వాడకం..

అవసరమైన రసాయనాలు, యంత్రాల కొరతతో రైతువేదికల్లో భూసార పరీక్షలను నిర్వహించడం లేదు. దీంతో క్షేత్రస్థాయిలో అన్నదాతలకు పంట భూముల స్వభావం తెలియక అధికమోతాదులో ఎరువులు, రసాయనాలను వినియగిస్తున్నారు. అంతేకాకుండా ఏళ్ల తరబడి ఒకే భూమిలో ఒకే పంటను సాగు చేస్తూ అనుకున్న దిగుబడిని సాధించడంలో విఫలమవుతున్నారు. దీంతో అన్నదాతలు నష్టాలను ఎదుర్కొంటున్నారు. రైతుల శ్రేయస్సు కోసం అలాగే పంట దిగుబడి పెంపునకు సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయాల్సిన అవసరం ఉంది.

ప్రైవేటు ల్యాబ్‌లలో పరీక్షలు..

వ్యవసాయాధికారులు భూసార పరీక్షలు నిర్వహించగా పోవడంతో రైతులు ప్రైవేటు ల్యాబ్ లను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారికి ఆర్థికంగా భారం కలుగుతోంది. కొన్ని ప్రైవేటు ల్యాబ్‌ల ఏజెంట్లు రైతుల పొలాలకు వెళ్లి మట్టి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒక్కోపరీక్షకు వారు రైతులవద్ద నుంచి రూ.300 వసూలు చేస్తున్నారు.

భూసార పరీక్షలు నిర్వహించాలి..

రామకృష్ణ, రైతు, కర్జవెల్లి



రైతులు ఏటా సంప్రదాయ పంటలు సాగు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. దిగుబడి కోసం విచ్చలవిడిగా రసాయనిక ఎరువులను వినియోగిస్తున్నారు. పెట్టుబడులు ఖర్చులు పెరిగిపోతున్నాయి. భూసార పరీక్షలు నిర్వహించి కార్డులు అందజేస్తే వాటికి అనుగుణంగా రైతులు పంటలు సాగు చేసే అవకాశం ఉంది.

కిట్లు అందిస్తే పరీక్షలు చేస్తాం..

రామకృష్ణ, మండల వ్యవసాయాధికారి, చింతలమానేపల్లి

భూసార పరీక్షలు నిర్వహించేందుకు కావాల్సిన పరికరాలున్నాయి. ప్రస్తుతం ఉన్న కిట్లు కాలం చెల్లినవి ఉన్నాయి. ప్రభుత్వం కిట్లను సరఫరా చేయడం లేదు. కిట్లను అందజేస్తే పరీక్షలు నిర్వహిస్తాం.

ఆశావర్కర్లకు నిర్వహించే పరీక్షను రద్దు చేయాలి


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 13: ఆశావర్కర్లకు నిర్వహించే పరీక్షను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆశవర్కర్లు జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పరీక్ష పెట్టేవిధానాన్ని రద్దుచేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్లు కనీస వేతనం రూ.10వేల ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమాచారి, స్వరూప, పద్మ, ఓమలా, కేసర, నవీన, రాజేశ్వరి, రంభ, సక్కుబాయి, సునీత, అరుణ, కవిత, నిర్మల, సునీత, భాగ్యలు పాల్గొన్నారు.

జేఈఈ ర్యాంకర్‌కు సన్మానం



విద్యార్థి అర్జున్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

వాంకిడి, జూన్ 13: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి దుర్గంఅర్జున్ జేఈఈమెయిన్స్‌లో 1782ర్యాంకు సాధించడంతో గురువారం కళాశాలలో ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ మాట్లా డుతూ మారుమూల వాంకిడి ప్రభుత్వ కళాశాలలో చదివి జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన, జూన్ 13: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గురువారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు జడ్పీటీసీ వేముర్ల సంతోష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కేజీబీవీ నూతన భవనం, సబ్‌సెంటర్లను ప్రారంభించాలని, అసంపూర్తిగా ఉన్న సులభ్‌కాంప్లెక్సు నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరారు. పైకాజీగూడ, రాంపూర్, పులికుంట, గోండుగూడ రోడ్లకు కంకర పోసి వదిలేసినట్టు, వెంటనే పూర్తి చేసేట్టు చూడాలని కోరారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జడ్పీటీసీ సంతోష్

పోడు రైతులను ఇబ్బందులు పెట్టొద్దు


ఎఫ్ఆర్వోతో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

పెంచికలపేట, జూన్ 13: మండలంలోని కొండపల్లి, లోడ్‌పల్లి గ్రామాల్లో ఉన్న పోడురైతులను అటవీశాఖ అధికారులు ఇబ్బందులు పెట్టవద్దని జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. గురువారం పెంచికలపేట మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో ఎఫ్ఆర్వోతో మాట్లాడారు. ఏళ్ల నుంచి సాగు చేసుకునే రైతుల నోట్లో మట్టి కొట్టవద్దని వారి జోలికి వెళ్లవద్దని, ఎవరిని కూడా వేధించవద్దన్నారు. ఆయనవెంట నాయకులు శ్రీనివాస్, తిరుపతి, సంజీవ్, రాజన్న తదితరులు ఉన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్, జూన్ 13: జిల్లాలో గురువారం పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి, తిర్యాణి మండలాల్లో ఆకాశం మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసింది.


కెరమెరిలో కురుస్తున్న వర్షం

కెరమెరి: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గురువారం వర్షం కురిసింది. దీంతో కొన్నిరోజులుగా ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో వాతావరణం చల్లబడింది. రైతులు చేనుల్లో పత్తిగింజలు నాటేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రాణహితనదిపై బ్యారేజ్ నిర్మించడమే శరణ్యం

- రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం ప్రతినిధులు


ప్రాణహిత కాలువలను పరిశీలిస్తున్న రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం ప్రతినిధులు

దహెగాం, జూన్ 13: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ ఆనకట్ట కూలిపోవడంతో ప్రత్యామ్నాయంగా తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై బ్యారేజ్ నిర్మించడమే శరణ్యమని హైదరాబాద్ రిటైర్డ్ ఇంజనీర్లసంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం వారు మండలంలోని కమ్మర్‌పల్లి శివారు నుంచి వెళ్తున్న ప్రాణహిత ప్రాజెక్టు కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం మారినప్పుడల్లా ప్రాజెక్టు సైట్లను మార్చి తెలంగాణ రాష్ట్రానికి, ప్రత్యేకంగా ఉత్తర తెలంగాణకు తీరని అన్యాయం చేశారని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయంగా ఉన్న తుమ్మిడిహెట్టి వద్దనే ప్రాజెక్టును వెంటనే నిర్మించాలని, ఎల్లంపల్లి వరకు గ్రావిటీ ద్వారా నీటిని తరలించాలని అన్నారు. త్వరలోనే రిటైర్డ్‌ఇంజనీర్లసంఘం ఆధ్వర్యంలో సీఎంను కలిసి విన్నవిస్తానని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ మాజీఅధ్యక్షుడు భీమయ్య, పుల్లారెడ్డి, శ్రీరాంరెడ్డి, రఘు మారెడ్డి, వెంకటయ్య, రిటైర్డ్ ఇరిగేషన్ చీఫ్‌ఇంజనీర్ హన్మంత్‌రెడ్డి, పాత వెంకటరమణ, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లలకు విద్య అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయం

తిర్యాణి, జూన్ 13: పేద పల్లలకు విద్య అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో మల్లేష్ అన్నారు. గురువారం ఎంపీపీ శ్రీదేవితో కలిసి కైరిగూడలోని ట్రైబల్‌వెల్ఫేర్ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూపదుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్యసభ్యులు యశోద, ఏపీఎం సదానందం, సీసీసంతోష్, వీవోఏ అన్నపూర్ణ, ఉపాధ్యాయురాలు సావిత్రి పాల్గొన్నారు.

పోడు రైతులతో అధికారుల చర్చలు విఫలం


సమావేశంలో పాల్గొన్న పోడు రైతులు

సిర్పూర్(టి), జూన్ 13: మండలంలోని ఇటిక్యాలపహాడ్ గ్రామంలోని రిజర్వు ఫారెస్టులో ఉన్న పోడుభూముల రైతులతో రెవెన్యూ, ఫారెస్టు అధికారులు గురువారం జరిపిన చర్చలు విఫలమయ్యాయి. రైతులకు అయిదు ఎకరాలు ఇవ్వాలని రైతులకు మద్దతుగా బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆర్డీవో సురేష్, ఎఫ్ఆర్వోలు అప్పలకొండ, పూర్ణచందర్ రావు మాట్లాడుతూ న్యాయబద్ధంగా ఒక్కొ క్కరికి రెండుఎకరాల చొప్పున ఉన్నతాధికా రులతో మాట్లాడి భూమిని కేటాయిస్తామ న్నారు. దానికి గ్రామస్థులు ఒప్పుకోలేదు. తాము మళ్లీచేనులలో సాగుచేసుకుంటామని రైతులు పేర్కొన్నారు. ఒక్కో కుటుంబానికి రెవెన్యూ, అటవీఅధికారులు అయిదు ఎకరాల చొప్పున పట్టాచేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు జిల్లా అధికారులకు నివేది కలు సమర్పిస్తామని సూచించారు. ఇటిక్యాల పహాడ్ గ్రామస్థులకు బీజేపీ నాయకులు కొంగ సత్యనారాయణ, అశోక్, శంకర్ మద్ద తుగా నిలిచారు. 50ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్నారని వారికిరెండు ఎకరాలచొప్పున ఇస్తామనడంఎంతవరకు సమంజసమని వారు అధికారులను ప్రశ్నించారు. ఒక్కో కుటుంబానికి అయిదుఎకరాల పట్టా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మండల సమస్యలు పరిష్కరించాలి

సిర్పూర్(యు), జూన్ 13: మండలానికి చెందిన నాయకులు ఎంపీ గోడం నగేష్‌ను ఆదిలాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. మండల సమస్యలు పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎంపీ హామీ ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌ను మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్ రావు, మండల వీటీడీఏ చైర్మన్ కుమ్ర భీంరావు, మడావి భోజ్జిరావు, గోడం యశ్వవంత్‌రావు, ఆత్రం జ్యోతిరాం తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ గోడం నగేష్‌ను సన్మానిస్తున్న మండల నాయకులు

పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టివేత

సిర్పూర్(టి), జూన్ 13: మహారాష్ట్రలోని గోండ్ పిప్రిరి తాలూకా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా పశువులను తరలిస్తున్న లారీని గురువారం సిర్పూర్ (టి) ఎస్సై దీకొండ రమేష్ పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా పశువులను రవాణా చేస్తున్నారన్న పక్కాసమాచారం మేరకు సిర్పూర్(టి) గ్రామసమీపంలో వాహనాల తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ తనిఖీల్లో ఓ లారీని సోదాలు చేయగా 38 పశువులు పట్టుబడినట్లు తెలిపారు. అక్రమార్కులు సిమెంట్ లారీగా చెప్పే ప్రయత్నం చేశారని కానీ లారీని తనిఖీచేయగా పశువుల ఉన్నట్లు పేర్కొన్నారు. పట్టుకున్న పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించి షేక్ జమీల్, షేక్ అర్బాజ్, మహమ్మద్ షేక్, జైనుద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, జూన్ 13: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఉప ప్రధానకార్యదర్శి నాగరాజు గోపాల్ అన్నారు. ఎస్ఆర్పీ1 గనిపై గురువారం యూనియన్ ఆధ్వర్యంలో గేట్‌మీటింగ్ నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతినెల అధికారికంగా నిర్వహించవలసిన రక్షణకమిటీలను పట్టించుకోవడం లేదన్నారు. దీనివల్ల కార్మికుల సమస్యలు పేరుకుపోయాయని ఆరోపించారు. కొందరు సూపర్‌వైజర్లు కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, గనుల్లో పనిముట్ల కొరత, వెంటిలేషన్ లోపం ఉందని, పని ఒత్తిడితో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయాసమస్యలను గుర్తింపుసంఘం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. కార్యక్ర మంలో బ్రాంచ్‌అధ్యక్షుడు గుల్లబాలాజీ, ఆర్గనైజర్ శ్రీనివాస్, పిట్‌కార్యదర్శి తోడే సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ రుణం ఆంక్షలు ఎత్తివేత

శ్రీరాంపూర్, జూన్ 13: సింగరేణిలో కార్మికుల ఇంటిరుణం వడ్డీ చెల్లింపుపై గతంలో ఉన్న ఆంక్షలను ఎత్తివేసేందుకు యాజమాన్యం అంగీకరిస్తూ సర్క్యులర్ జారీచేసిందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వి సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి కార్మికులు గతంలో బ్యాంకుల నుంచి ఇంటి నిర్మాణం, ఇల్లు కొనుగోలుకోసం రుణం తీసుకుని ఒక ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసుకుంటే సింగరేణి యాజమాన్యం వడ్డీ చెల్లించేదన్నారు. కానీ ఆలస్యమైతే ఇచ్చేది కాదన్నారు. అదేవిధంగా 8.33శాతం కంటే తక్కువ వడ్డీకి బ్యాంకు రుణం తీసుకున్నవారికి 6,7శాతం మాత్రమే చెల్లించేవారన్నారు. ఈ సమస్యను తమ యూనియన్ ఆధ్వర్యంలో సింగరేణి డైరెక్టర్(పా), జీఎం(ఫైనాన్స్)ల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీంతో గతంలో ఇల్లు నిర్మించుకున్నా, కొనుగోలు చేసిన సమయంలో వడ్డీ చెల్లించేందుకు, అలాగే 8.33వడ్డీని ఇచ్చేందుకు సర్క్యులర్‌ను సవరించినట్లు పేర్కొన్నారు. కార్మికులు గమనించి, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పారదర్శకంగా ఈపీ ఆపరేటర్ పరీక్షలు


అధికారులతో మాటాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, జూన్ 13: ఈపీ ఆపరేటర్(ట్రైనీ) పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని శ్రీరాంపూర్, మందమర్రి ఏరియా జీఎంలు బి సంజీవరెడ్డి, మనోహర్ అన్నారు. అధికారులతో వారు ఆయా ఏరియాల్లోని జీఎం కార్యాలయాల్లో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈపీ ఆపరేటర్(ట్రైనీ) పోస్టుల భర్తీకి ఈనెల18నుంచి 21వ వరకు ప్రాక్టీకల్ పరీక్షలు ఉంటాయన్నారు. మందమర్రిలో మాత్రం ఈనెల 18,19తేదీల్లో ఎంపిక ఉంటుందని జీఎం మనోహర్ తెలిపారు. పరీక్షల సందర్భంగా వీడియో చిత్రీకరణ ఉంటుందని, ఎటువంటి అవకతవకలు జరుగకుండా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ చంద్ర శేఖర్‌రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, రవీందర్, రాము, ఎస్ఎస్‌వో మురళీ మోహన్, మందమర్రిజీఎం కార్యాల యంలో జరిగిన సమావేశంలో అధికారులు రాజన్న, శ్రీనివాసులు, రాజు, నాగరాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్ల పదోన్నతుల కోసం పరీక్షలు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా కైరిగూడ ఓసి వద్ద గురువారం బెల్లంపల్లి రీజియన్ పరిధిలోని ఈపీ ఆపరేటర్ పదోన్నతుల కోసం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. బీ గ్రేడ్ నుంచి ఏ గ్రేడ్ పదోన్నతి కోసం 22 మంది ఆపరేటర్లు పరీక్షలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఉమాకాంత్, పిట్ ఇంజనీర్ వీరన్న, కార్పొరేట్ మెంబర్ శ్యాంసుందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఇంజనీర్లు మహేశ్వర్, ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

రెండో పెన్షన్ అమలు చేయిస్తాం

శ్రీరాంపూర్, జూన్ 13: అధికారుల మాదిరిగా కార్మికులకు సైతం రెండో పెన్షన్ అమలు చేయిస్తామని ఐఎన్‌టీయసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్ రావు అన్నారు. ఆర్కే5 గనిపై గురువారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే తాము పలు సమస్యలు పరిష్కరించామన్నారు. కార్మికులకు రెండో పెన్షన్, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం, తదిత హామీలు నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేనశ్యామ్, జాతీయ సమితి సభ్యుడు సీహెచ్ భీంరావు, కేంద్ర ఉపప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

మందమర్రిటౌన్, జూన్ 13: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం చొరవచూపాలని సీఐటీయూ మందమర్రిబ్రాంచ్ కార్యదర్శి వెంకటస్వామి, అల్లి రాజేందర్ పేర్కొన్నారు. గురువారం మందమర్రిలో వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నోఆశలు పెట్టుకున్నారని కొత్త గనులను ఏర్పాటు చేస్తుందని, ఉపాధి అవకాశాలు పెంచుతుందని ఎదురుచూస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీలో గోల్డ్‌మెడల్

లక్షెట్టిపేటరూరల్, జూన్ 13: జాతీయ స్థాయి 90వ సిగ్మా ఆర్ట్ ఫొటో గ్రఫీ వర్క్‌షాపులో పట్టణానికి చెందిన ఇందూరి సాయికృష్ణ ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించారు. ఈనెల 6 నుంచి 12 వరకు కులుమనాలిలో జరిగిన వర్క్‌షాప్‌లో వివిధ రాష్ట్రాల నుంచి సుమారు వంద మందికి పైగా పాల్గొన్నారు. స్పాట్ కాంపిటేషన్‌లో ట్రావెల్ విభాగంలో తీసిన ఫొటోకు ఇందూరి సాయికృష్ణ గోల్డ్‌మెడల్ సాధించారు. సాయికృష్ణకు అకాడమీ అవార్డును, ప్రశంసాపత్రాన్ని అకాడమీ అధ్యక్షుడు శేఖర్, నూతనకుమార్‌లు అందజేశారు. సాయికృష్ణను ఫొటోగ్రాఫర్లు అభినందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మందమర్రిరూరల్, జూన్ 13 : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యుడు రమేష్ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతున్నందున ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని పేర్కొన్నారు. నీలు కలుషితం కావడం వల్ల అతి సార, ఇతర వ్యాధులు సోకే అవకాశం ఉంటుందని తెలిపారు. అనారోగ్యంగా ఉంటే వెంటనే ఆసుపత్రికి రావాలని సూచించారు. ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీఎం లలితకుమారి, ఏపీవో రజియాసుల్తానా, డిప్యూటి తహసీల్దార్ రవీందర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ పండగను ప్రశాంతంగా జరుపుకోవాలి

చెన్నూరు, జూన్ 13 : బక్రీద్ పండగను ప్రశాంతం వాతావరణంలో జరుపుకోవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం చెన్నూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ముస్లిం మత పెద్దలతో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బక్రీద్ పండగను ప్రశాంతంగా జరుపు కోవాలని సూచించారు. ఎలాంటి గొడవలకు తావి వ్వకూడదన్నారు. అన్ని మసీదుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీఐ రవీందర్, ఎస్ఐ వెంకటేశ్వర్‌రావు,ముస్లీం మత పెద్దలు పాల్గొన్నారు.

తాండూర్: బక్రీద్ పండగ ఉన్న నేపథ్యంలో గురువారం ఎస్ఐ కిరణ్‌కుమార్ పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులుంటే తమకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి : సీపీ



శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో సీపీ శ్రీనివాస్

శ్రీరాంపూర్, జూన్ 13: ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్‌లను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఏవైనా సమస్యలున్నాయా అని తెలుసుకున్నారు. జూలై 1, 2024 నుంచి నూతన చట్టాలు అమలు చేస్తున్న సందర్భంగా పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన విధానాలపై సిబ్బందికి అవగాహన ఉండాలన్నారు. ఇందులో భాగంగా పెద్దపల్లి, మంచిర్యాల జోన్ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తామన్నారు. ఎన్నికల సందర్భంగా పోలీస్ సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వర్తించారని అభినందించారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్‌ఐలు సంతోష్, ప్రసన్న ఉన్నారు.

మూగజీవులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత



మందమర్రిటౌన్, జూన్ 13: పట్టణంలోని కేకే ఓసీపీ టోల్‌గేట్ వద్ద గురువారం మూగ జీవాలను తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు పట్టుకున్నారు. వ్యాన్ డ్రైవర్‌ను ప్రశ్నించగా ఆవులు ఉన్నాయని చెప్పడంతో పరిశీలించగా ఆవులు కిక్కిరిసి ఉండడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను విచారించగా కుమరం భీంజిల్లా ఆసిఫాబాద్ నుంచి హైద్రాబాద్‌కు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారని ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. డ్రైవర్‌లు హైద్రాబాద్‌లోని బహదూర్‌పురకు చెందిన ఎండీ అహ్మద్, సయ్యద్ అలీంలకు మీర్జాజావేద్ సహాయం చేశాడని తెలిపారు. ఎద్దులను వాంకిడికి చెందిన సాదిక్ సరఫరా చేశారని ఎస్ఐ తెలిపారు. విచారణ చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు.

దండేపల్లి: దండేపల్లి మండలం గూడెం తనిఖీ కేంద్రం వద్ద అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్న ఆవుల వ్యాను పట్టుకున్నట్లు ఎస్సై భూమేష్ తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి నుంచి అక్రమంగా 18 ఎద్దులను వ్యానులో తరలిస్తుండగా గూడెం తనిఖీ కేంద్రం వద్ద వ్యాను ఆపి తనిఖీ చేసి పట్టుకున్నారు. వాటిని మదాపూర్ శ్రీకృష్ణ గోశాలకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగులను నిర్మూలిద్దాం


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 13: ఆరోగ్యవంతమైన పిల్లలకోసం నులిపురుగులను నిర్మూలిద్దామని జిల్లాలో ఈనెల 28న జరగనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామని అదనపుకలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1నుంచి19 సంవత్సరాల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను అందిస్తామన్నారు. జిల్లాలోని 2,01,143మందికి ఈనెల20న మాత్రలు అందించేందుకు కార్యచరణరూపొందించామన్నారు. ఆ రోజు మాత్రలు అందని వారికి ఈనెల27న అందిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్యకేంద్రాలను మాత్రలను వేస్తామన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు తప్పని సరిగా నులిపురుగుల నివారణ మాత్రలను వేయించాలని సూచించారు. అనంతరం కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, డీఎంహెచ్‌వో అనిత, ప్రో గ్రాం అధికారి నీరజ, జిల్లా మైనార్టీ అధికారి రాజేశ్వరి, గిరిజనాభివృద్ధి అధికారిగంగారాం, సర్వేలెన్స్ అధికారి పయాజ్, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

భీమారం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యఅందిచాలని అదనపుకలెక్టర్ రాహుల్‌సూచించారు. గురువారం పోలంపల్లి, అంకుశాపూర్‌లలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తుందన్నారు. అనంతరం మద్దికల్‌లోనర్సరీని పరిశీలించి వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు.

శ్రీరాంపూర్: పిల్లలవికాసంతో సమాజానికి మేలు జరుగుతుందని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రాహుల్ అన్నారు. శ్రీరామచంద్రమిషన్ ఆధ్వర్యంలో నస్పూర్‌లో నిర్వహించిన బ్రైటర్ మైండ్స్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆయన హాజరై ధ్రువీకరణపత్రాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ, పిల్లలు ఎలాంటి భావోద్వేగాలకు లోనుకావద్దన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ వెంకటేష్ పాలకుల, జోనల్ కో-ఆర్డినేటర్ సతీష్ జంజిరాల పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

రామకృష్ణాపూర్, జూన్ 13: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ గౌడ్, కౌన్సిలర్ జిలకర మహేష్‌లు అన్నారు. గురువారం అమరవాది గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నంది వెంకటస్వామి ఇటీవల పాముకాటుకు గురై మరణించడంతో కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల ఇన్సూరెన్సు చెక్కును అందజేశారు. వారు మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీశాసన సభ్యులు బాల్క సుమన్ చొరవతో చెక్కు అందించేలా కృషి చేశారన్నారు. జాడి శ్రీనివాస్, లింగయ్య, మల్లయ్య, రాజయ్య, సత్తయ్య, ప్రసాద్, మున్నా, రఘు, తిరుపతి, పాల్గొన్నారు.

హద్దురాళ్ళ తొలగింపు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

భీమారం, జూన్ 13 : నిబంధనలు ఉల్లంఘన కథనానికి అధికారులు స్పందించారు. అదనపు కలెక్టర్ రాహుల్ పోలంపల్లి, భీమారం గ్రామాల్లోని అక్రమ వెంచర్లలో హద్దురాళ్లను తొలగించాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యదర్శులు గురువారం సిబ్బంది చేత అక్రమ వెంచర్ల హద్దురాళ్లను తొలగించారు. ఎవరైనా అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని అదనపు కలెక్టర్ హెచ్చరించినట్లు మండల అధికారులు తెలిపారు.

అందుబాటులోకి ఫ్రీజర్

బెల్లంపల్లి, జూన్ 13: తిలక్‌గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఫ్రీజర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి ప్రారంభించారు. వాకర్ సభ్యులు రాజన్న, రామన్న, నాగేష్‌కుమార్, జయరాంయాదవ్, విద్యాసాగర్, సుగుణాకర్, అనిల్, పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు

తాండూర్, జూన్ 13: కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఈ నెల 15, 16 తేదీల్లో మాదారం పోలీస్‌స్టేషన్ మైదానంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని సీఐ కుమారస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్, భీమిని, కన్నెపల్లి మండలాలకు చెందిన యువకులు పాల్గొనవచ్చని తెలిపారు. పాల్గొనే టీంలు పోలీస్‌ స్టేషన్‌లో ఎస్‌ఐని సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. తాండూర్ ఎస్ఐ 8712656575, భీమిని ఎస్ఐ 8712656578, కన్నెపల్లి ఎస్ఐ 8712656577, మాదారం ఎస్ఐ 8712656576లో సంప్రదించాలన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు శిక్ష

బెల్లంపల్లి, జూన్ 13: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురు వ్యక్తులకు గురువారం తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుకున్న ఐదుగురుని బెల్లంపల్లి జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ ఎదురు హాజరు పర్చగా ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

పాఠశాలలో చేరిక

మందమర్రిరూరల్, జూన్ 13 : మండలంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో అడ్మిషన్‌కు పరీక్ష రాసి అర్హత పొందిన ఇద్దరు విద్యార్థులు సరైన సమాచారం లేకపోవడంతో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి గురువారం వారి ఇండ్లకు వెళ్లి అడ్మిషన్‌లు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మందమర్రి 1వ జోన్‌కు చెందిన సూర్య, రామకృష్ణాపూర్‌కు చెందిన హన్షిత్‌లు 6వ తరగతిలో సీట్లు సాధించారు. విద్యార్థుల విద్యావకాశం కోల్పోతారని ఆలోచించి ఇంటికి వెళ్లి అడ్మిషన్ ఇచ్చినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అమీర్‌పాషా, పూర్ణచందర్, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ తోఫాల పంపిణీ


బక్రీద్ తోఫా పంపిణీ చేస్తున్న కొక్కిరాల సురేఖ

హాజీపూర్, జూన్ 13 : మండలంలోని ముస్లిం మహిళలకు కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ బక్రీద్ తోఫాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. బక్రీద్ పండగను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

లక్షెట్టిపేటరూరల్: పట్టణంలోని విశ్రాంతి భవనం ఆవరణలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ బక్రీద్ తోఫాలను పంపిణీ చేశారు. ఎంపీపీ అన్నం మంగ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ఎండీ ఆరీఫ్, కౌన్సిలర్ చింత సువర్ణఅశోక్ పాల్గొన్నారు.

దండేపల్లి: నియోజకవరంలోని పేద ప్రజలకు కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షురాలు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి సురేఖ అన్నారు. మండల కేంద్రంలో బక్రీద్ తోఫలను పంపిణీ చేశారు. పండుగను సంతోషగా జరుపుకో వాలన్నారు. ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు, ఆర్థికసాయం అందజేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ గడ్డం నాగరాణి త్రిమూర్తి, పార్టీ మండల అధ్యక్షుకార్యదర్శు వెంకటేశ్వర్లు, సతీష్, ఎంపిటిసిలు శ్రీనివాస్, కమలాకర్, మోహన్, నవీన్, పార్టీ నాయకులు, మైనార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి


ఎమ్మెల్యేతో మున్సిపల్ వైస్ చైర్మన్, నాయకులు

చెన్నూరు, జూన్ 13 : చెన్నూరు మున్సిపాలిటీలో రూ. 28 కోట్ల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, వెంటనే చేపట్టాలని గురువారం హైద్రాబాద్‌లో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామికి మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజుద్దీన్, రామ్‌లాల్‌గిల్డాలు వినతి పత్రం అందించారు. అనంతరం నిధుల జీవో ప్రతులను ఎమ్మెల్యేకు అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పనులను త్వరగా చేపట్టేలా చూస్తానని తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

వేమనపల్లి, జూన్ 13 : జిల్లెడ, సూరారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనులను గురువారం ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 13: ఆపదలో ఉన్న వారికి రక్తం ఎంతో అవసరం. ప్రమాదాలు, విపత్కర పరిస్థితుల్లో బాధితుల శరీరంలో రక్తం తగినంతగా లేకపోవడంతో మరొకరి రక్తాన్ని ఎక్కిస్తారు. రక్తదానం చేయడం సేవ మాత్రమే కాదు ప్రతీ ఒక్కరి బాధ్యత.

ఆస్ట్రియన్, అమెరికన్ జీవ శాస్త్రవేత్త, వైద్యుడు కార్ల్ ల్యాండ్ స్టీనర్ మానవ రక్తంలోని రకాలను కనుగొన్నందుకు 1930లో నోబెల్ బహుమతి లభించింది. ఆయన జయంతి పురస్కరించుకొని 1968 జూన్ 14న వరల్డ్ బ్లడ్ డోనర్స్ డేగా 2004 నుంచి జరుపుకొంటున్నాం.

-ఎన్నిసార్లు రక్తదానం చేయవచ్చు

ఆరోగ్యంగా ఉండి 18-60 ఏండ్లలోపు వారు రక్తదానం చేయడానికి అర్హులు. ఒక వ్యక్తి తన జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ఒకసారి రక్తదానం చేసిన తర్వాత మహిళలైతే ఆరు నెలలు, పురుషులు మూడు నెలల తర్వాత మళ్లీ రక్తదానం చేయవచ్చు.

జిల్లా కేంద్రంలో విస్తృతమైన సేవలు

జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టర్, చైర్మన్‌ల నేతృత్వంలో 2008 డిసెంబర్ 4న రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరిస్తున్నారు. సొసైటీ సభ్యులు రక్తదాన శిబిరాలను నిర్వహించాలని ఆయా శాఖల అధికారులకు వినతి పత్రాలు అందిస్తున్నారు. రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి కేంద్రంలో ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి గురువారం తెలిపారు. రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

ఎరువుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

జైనూర్, జూన్ 13: మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ గోదాంలో గురువారం ఎరువులు కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘంచైర్మన్ కొడప హన్నుపటేల్, సహకారబ్యాంక్ మేనేజర్ సత్యశ్రీవాణి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొడప హన్నుపటేల్ మాట్లాడుతూ గిరిజనప్రాంత రైతులకోసం తక్కువధరలకు సహకారం కేంద్రం ద్వారా ఎరువులు అందిస్తున్నామని ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు ఆధార్ కార్డులను వెంటతీసుకొని వచ్చి ఎరువులను కొనుగోలుచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఈవో సోనకాంబ్లే జనార్దన్, మాజీఎంపీపీ కొడప దర్మారావ్, తాజా మాజీ సర్పంచులు మడావి భీంరావ్, మార్కెట్ సిబ్బంది మధు, రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సహకార చైర్మన్ హన్నుపటేల్

గ్రామాల్లో వైద్య పరీక్షలు

జైనూర్, జూన్ 13: మండలంలోని దేవుగూడ, ఉషేగాం, టింకాపెల్లి, కొండాపటార్ తదితర గ్రామాల్లో ఉషేగాం పీహెచ్‌సీ వైద్యాధికారి రాజు అధ్వర్యంలో గురువారం వైద్యపరీక్షలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సాధారణ జ్వరాలతో బాధపడుతున్న రోగులకు వైద్యం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు, కూలీలు చేను పరిసర ప్రాంతాల్లో చెలిమెల నీరు తాగకూడదని అన్నారు. గ్రామాల్లో జ్వరాలు వ్యాప్తి చెందితే వెంటనే తమను సంప్రదిస్తే వైద్యం చేసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆయనవెంట హెల్త్ సూపర్‌వైజర్ రమేష్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సఖీ సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సఖీ నిర్వాహకులు

కౌటాల, జూన్ 13: మండలం కేంద్రంలో గురువారం సఖీసేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గృహహింస, వరకట్నం వేధింపులు, బాల్యవివాహాలు, లైంగికహింస, పనిచేసేచోట వేధింపులు, ఆడపిల్లల అమ్మకం తదితరాలపై అవగాహన కల్పించారు. ఏమైనా ఇబ్బందులుంటే మహిళా హెల్ప్‌లైన్181 సమాచారం అందించా లన్నారు. అనంతరం సఖీ ఆధ్వర్యంలో అందిస్తున్న వైద్యసేవలు, కౌన్సెలింగ్, పోలీసు సహాయం తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సఖీ సిబ్బంది పవిత్ర, జానుబాయి, రఘు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలోకి ఎవరూ ప్రవేశించకూడదు: ఎస్సై

చింతలమానేపల్లి, జూన్ 13: మండలంలోని డబ్బా ఎక్స్‌రోడ్డులో గల పూలాజీబాబా విగ్రహంవద్ద ఉన్న సర్వే నెం.174/2/22/1లోని అయిదుఎకరాల స్థలంపై ఇరు వర్గాల మధ్య నెలకొన్న వివాదంలో నేపథ్యంలో అందులోకి ఎవరూ ప్రవేశించరాదని ఎస్సై నరేష్ తెలిపారు. ఆ స్థలం తమదేనంటూ గ్రామానికిచెందిన నందారాం, అతని కుటుంబసభ్యులు, బారెకులస్తుల మధ్య గొడవ జరుగుతోందన్నారన్నారు. ఈస్థలంవిషయంలో తహసీల్దార్ నాగరాజుగౌడ్ 145సీఆర్పీసీ ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. స్థలం అసలు యజమానికి తేలేవరకు ఎవరు కూడా అక్కడికి వెళ్ల రాదన్నారు.

నలుగురిపై కేసు నమోదు

దహెగాం, జూన్ 13: మండలంలోని గొర్రెగుట్ట గ్రామానికి చెందిన నలుగురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెగుట్ట గ్రామానికి చెందిన షేక్ నజీరాబీ ఇంటికి ఈనెల 5న షేక్‌వజీర్, షేక్‌నిజాం, షేక్ సలీం, షేక్ హబలు వెళ్లి పెరటి భూమి తమదేనని గొడవకు దిగారు. నజీరాబీ కుటుంబసభ్యులను దూషిస్తూ దాడిచేసి చంపుతామని బెదించారు. దీంతో బాధితురాలు నజీరాబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సన్నబియ్యం పేరిట మోసం


కాగజ్‌నగర్, జూన్ 13: జైశ్రీరాం బియ్యం అమ్ముతామని చెప్పి రేషన్ బియ్యం పలువురికి అంటగట్టిన సంఘటన కాగజ్‌నగర్‌లో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే కాగజ్‌నగర్ కాపువాడలో జైశ్రీరాం బియ్యం అమ్మేందుకు ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చారు. తాము క్వింటాలుకు రూ.2వేల చొప్పున జైశ్రీరాం బియ్యం అమ్ముతున్నామని పలువురిని నమ్మించారు. దీంతో నాణ్యమైన బియ్యం కారుచౌకగా వస్తున్నాయని తెలిసి నలుగురు ఒక్కొక్కరు క్వింటాలు చొప్పున కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్లి సంచులను తెరిచి చూడగా రేషన్ బియ్యం కనిపించాయి. దీంతో మోసపోయామని తేరుకొని ఇద్దరు యువకుల కోసం ఎంత వెతికినా దొరకలేదు.

కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే

బెజ్జూరు/దహెగాం, జూన్ 13: గ్రామాల్లో ఇంటింటికి మిషన్ భగీరథ నీరు వస్తుందా, నల్లా కనెక్షన్ ఉందా అనే దానిపై అధికారులు సర్వే చేపడుతున్నారు. గురువారం ఎంపీవో రమేష్‌రెడ్డి మిషన్‌భగీరథ సర్వేను పర్య వేక్షించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రుత్విక్, కార్యదర్శి తుకారాం తదితరులు ఉన్నారు. దహెగాంలో ఐకేపీ వీవోఏ, గ్రామ పంచాయతీ సిబ్బంది ఇంటింటి సర్వే నర్వహించారు.


బెజ్జూరులో సర్వే చేస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





మృతదేహాలను వెలికితీస్తున్న స్థానికులు

భవన నిర్మాణ పనుల్లో ప్రమాదం
ముగ్గురు సజీవ సమాధి

- మంచిర్యాల జిల్లా కేంద్రంలో విషాదం
- మృతులు కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా వాసులు
- సంఘటన స్థలాన్ని సందర్శించిన సీపీ, అదనపు కలెక్టర్, ఆర్డీవో



రోదిస్తున్న మృతుల కుటుంబీకులు

రోజులాగే కూలీ పనులకు వెళ్ళిన వారు పని స్థలంలోనే సజీవ సమాధి అయ్యారు. పదిహేను రోజులుగా అక్కడే పని చేస్తున్న కూలీలపై పక్కనే ఉన్న గోడ కూలి పైన పడడంతో శిథిలాల కింద ముగ్గురు మృతి చెందిన సంఘటన గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకొంది.



ఎనాంక హన్మంతు (ఫైల్)



ఆత్రం శంకర్ (ఫైల్)



గోలెం పోశం (ఫైల్)

ఏసీసీ, జూన్ 13: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా ఓ ప్రైవేట్ ఆసుపత్రి పక్కన భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సుమారు 10 మంది కూలీలు గురువారం పనులు చేస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో పనుల్లో భాగంగా మట్టి తవ్వు తుండగా పక్క బిల్డింగ్ గోడ కూలి కూలీలపై పడింది. శిథిలాలను తొలగించి చూడగా వీరిలో కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం రుద్రాపూర్ చెందిన ఎనాక హన్మంతు(45), అదే మండలానికి చెందిన ఆత్రం శంకర్ (42), గోలెం పోశం(46) అక్కడిక క్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన రమేష్ ప్రభుత్వ ఆసు పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు, అగ్నిమాపకశాఖ సిబ్బంది ఎక్స్‌కావేటర్ సహాయంతో మృతదేహాలను శిథిలాల నుంచి వెలికితీశారు. పెద్దపెద్ద కాంక్రీట్ దిమ్మలు ఉండటంతో మృతదేహాలను వెలికి తీయడంలో ఆలస్యం జరిగింది. డ్రిల్లింగ్ మెషీన్లతో వాటిని పగులగొట్టి మృతదేహాలను బయటకు తీశారు.

ఎనాంక హన్మంతు కొన్నేళ్ళుగా మంచిర్యాల పట్టణంలోని భగవంతం వాడలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. భార్య లక్ష్మీ, కొడుకులు రాజేష్, అంకుస్, కూతురు శివానీ ఉన్నారు. శివానీకి వచ్చే నెలలో వివాహం చేయాలని నిర్ణయించినట్లు బంధువులు తెలిపారు. చింతలమానేపల్లి గ్రామానికి చెందిన గోలం పోశంకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు బంధువులు తెలిపారు. బాబా సాగర్‌కు చెందిన ఆత్రం శంకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉదయం పనికి వెళ్లి మధ్యాహ్నం వరకు విగత జీవులుగా మారడం పలువుర్ని కలచి వేసింది. ప్రమాదం జరగడానికి కారణం బిల్డింగ్ యాజమాన్యం నిర్లక్ష్యమేనని, పక్కన ఉన్న ప్రహరీ శిథిలావస్థకు చేరినట్లు భవన యజమానికి తెలిపినా పట్టించుకోలేదని మృతుల కుటుంబీకులు తెలిపారు. ఏసీపీ ప్రకాష్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ బన్సీలా ల్, పోలీస్ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం : సీపీ

సంఘటనా స్థలానికి చేరుకొన్న సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘటనకు సంబంధించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడతామన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లనే ప్రమాదం జరిగిందని, జాగ్రత్తలు తీసుకుని ఉంటే ముగ్గురి ప్రాణాలు పోయేవి కావన్నారు. బిల్డింగ్ యాజ మాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

- అదనపు కలెక్టర్ రాహుల్ మాట్లాడుతూ మృతుల కుటుంబాలను ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు.

సంఘటనపై మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ వివరణ కోరగా స్టిల్ట్ (పార్కింగ్ ఏరియా) తోపాటు మూడంతస్తుల భవన నిర్మాణానికి అనుమతులు ఉన్నాయన్నారు.

చింతలమానేపల్లిలో విషాదం

చింతలమానేపల్లి: మంచిర్యాలలో జరిగిన ప్రమాదంలో చింతల మానేపల్లి మండలానికి చెందిన ముగ్గురు కూలీలు మృతి చెందడం తో మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కూలీలు భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తే జీవనం సాగిస్తున్నారు. పొట్ట కూటి కోసం మంచిర్యాల పట్టణానికి పనులకు వెళ్తే మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.



రైతు భరోసా కోసం ఎదురుచూపులు

- వానాకాలం సాగుకు సన్నద్ధమైన రైతులు
- అందని పెట్టుబడి సహాయం
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు

బెల్లంపల్లి, జూన్ 13: రైతుభరోసా కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి రైతులు అప్పులు చేయకుండా ఆదుకునేందుకు గత ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. అనంతరం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పథకం పేరు రైతు భరోసాగా మార్చారు. ఎకరానికి రూ. 10 వేల నుంచి రూ.15 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. రైతు భరోసా విషయంలో స్పష్టత లేకపోవడంతో రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తు న్నారు. పొలాల్లో దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేశారు. పంట పెట్టుబడి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 1.40 లక్షల మందికి పైగా రైతులు

జిల్లా వ్యాప్తంగా 1.40 లక్షల మంది రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వం రైతుబంధు కింద ఎకరాకు రూ. 10 వేలను రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, ఆరు గ్యారంటీల్లో భాగంగా రైతుభరోసా పేరుతో ఎకరాకు యేటా రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. యాసంగి సీజన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జిల్లా వ్యాప్తంగా రూ.154 కోట్ల వరకు రైతుల ఖాతాల్లో జమ చేసింది. వానాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు ప్రభుత్వం రైతు భరోసాపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైతులు ఆదోళన చెందుతున్నారు. గతేడాది కంటే ఈ యేడు పెట్టుబడి ఖర్చులు అధికమయ్యాయి. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు, కూలీల ఖర్చులు పెరిగాయి. పెట్టుబడి ఖర్చులు భరించలేనంతగా పెరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా కింద పెట్టుబడి సహాయం ఎకరాకు రూ. 15 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నారు.

రైతు భరోసా డబ్బులు ఇవ్వాలి

: రాజయ్య, రైతు , బెల్లంపల్లి

వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో ఇప్పటికే పంట పొలాలను సిద్ధం చేశాం. పత్తి విత్తనాలు, ఇతర ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తుంది. రైతు లకు పెట్టుబడి కోసం రైతు భరోసా కింద ప్రభుత్వం డబ్బులు ఇస్తే సహాయంగా ఉంటుంది. వెంటనే ప్రభుత్వం పెట్టుబడి సహాయం అందించాలి.

పంట పెట్టుబడికి కష్టమవుతుంది

సంతోష్, రైతు , చెర్లపల్లి

ఐదెకరాల్లో పత్తి, వరి పంటలను సాగు చేసేందుకు సిద్ధం చేశాను. ఎకరాకు దాదాపు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టాలి. ప్రభుత్వం పెట్టుబడి సహాయం అందిస్తే రైతులకు అప్పులు కాకుండా ఉంటారు. త్వరగా రైతు భరోసా అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బెల్లంపల్లి, జూన్ 13: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని, సురక్షితమైన మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మురికి కాలువలు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. కౌన్సిలర్లు బండి ప్రభాకర్, కొమ్ము సురేష్, నాయకులు నెల్లి రమేష్, వెంకటేష్, మున్సిపల్ ఏఈ సందీప్, ఎస్ఐ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ



విచారణ జరుపుతున్న డీఎల్‌పీవో ధర్మరాణి

జైపూర్, జూన్ 13: మండలంలోని వెంకటరావుపల్లె పంచాయతీ కార్యదర్శి రమాదేవిపై గురువారం డీఎల్‌పీవో ధర్మరాణి విచారణ చేపట్టారు. వెంకటరావుపల్లె ప్రజలు కొందరు ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నా సంక్షేమ పథకాలు అందడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీవో విచారణ చేపట్టారు. ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించిన కార్యదర్శి 12 మంది దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని తేలిందన్నారు. ఎంపీవో అనిల్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పీఎస్‌ఆర్‌కు మంత్రి పదవి రావాలని పూజలు



పూజలు చేస్తున్న కార్యకర్తలు

శ్రీరాంపూర్, జూన్ 13: ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావుకు మంత్రి పదవి రావాలని నస్పూర్‌లోని 22వ వార్డు ఇన్‌చార్జి పడాల సంజీవ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రేంసాగర్‌రావు కాంగ్రెస్ పార్టీని కాపాడుతున్నారని, ఇంద్రవెల్లి సభను విజయవంతం చేశారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఇంద్రవెల్లి సభ ఎంతో దోహదం చేసిందన్నారు. పార్టీ కోసం కృషి చేస్తున్న ప్రేంసాగర్ రావుకు మంత్రి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు కొసరి శ్రీనివాస్, కురిమిళ్ల పోషం, వెంకటేశ్వర్లు, చంద్రం, రాజు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వేలో అలసత్వం వద్దు

లక్షెట్టిపేటరూరల్, జూన్ 13 : మిషన్ భగీరథ సర్వేలో సిబ్బంది అలసత్వం చేయకూడదని ఎంపీడీవో సరోజ అన్నారు. వెంకటరావుపేట, చందారం, పాత కొమ్ముగూడెంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వేను గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఉన్నతాధిరులు విధించిన గడువులోగా సర్వే పూర్తి చేయాలంటే రోజు కనీసం 50 ఇండ్లు సర్వే చేయాలని సూచించారు. ఇంటింటికి మిషన్ భగీరథ నీరు వస్తుందా, నల్లా పనిచేస్తుందా అనే విషయాలను పరిశీలించి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఏపీవో వెంకటరమణ,సర్వే సిబ్బంది వంశీకృష్ణ, శ్రీలత, వరుణ్‌గౌడ్, కైవల్య , శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు



శ్రీరాంపూర్, జూన్ 13: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలిశారు. సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌ఎంపీ, పీఎంపీలపై తనిఖీలు చేపట్టడం నిలిపివేయాలని కోరారు. సీఎం స్పందించి తనిఖీలు చేపట్టవద్దని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. సీఎంను కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు నేతి నాగేశ్వర్‌రావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు హనుమంతరావు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రాజమౌళి, జిల్లా ఉపాధ్యక్షుడు రొడ్డ రాజేశం, జిల్లా ప్రచార కార్యదర్శి సుంచు శంకర్ వర్మ, పట్టణ నాయకుడు వెంకటేష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ

వేమనపల్లి, జూన్ 13 : వేమనపల్లి, గొర్లపల్లి, నీల్వాయి గ్రామాల్లోని ఫెర్టిలైజర్ దుకాణాలను గురువారం ఏడీఏ సురేఖ తనిఖీ చేశారు. స్టాకు వివరాలు, రిజిష్టర్‌లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఫెర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను ఎంఆర్‌పీ ధరలకు విక్రయించాలని సూచించారు. ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు కొన్న వాటికి బిల్లులు అందజేయాలన్నారు. వేమనపల్లి, నీల్వాయి డీసీఎంఎస్ కేంద్రాల్లో త్వరలోనే యూరియాను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఏఈవో రుక్సార్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

చెన్నూరు: సుందరసాల సమీపంలోని అన్నారం బ్యారేజీ చెక్‌పోస్టు వద్ద ఏవో శ్రీనివాస్‌రెడ్డి గురువారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత విత్తనాలు, గడ్డి మందులు అమ్మితే చర్యలు ఉంటాయన్నారు. రైతులు విత్తనాలు కొన్న తర్వాత రశీదులు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న మంచిర్యాల జిల్లా విద్యా సంస్థలు

ఆదర్శ పాఠశాలలో ఏకరూప దుస్తులు పంపిణీ

దండేపల్లి, జూన్ 13: లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఏక రూప దుస్తులతో పాటు పాఠ్య పుస్తకాలను ప్రిన్సిపాల్ అనిలా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ఏక రూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను అందజేస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయిలో నిలవాలన్నారు. పోటీతత్వంతో చదువుకున్నప్పుడే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ బాధ్యులు, సభ్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.